# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు సమున్నత లక్ష్యాలతో పని చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో జరిగిన అపచారాలపై విచారణకు ఐజీ, ఆపై స్థాయి అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు.**
3. **తెలంగాణ పర్యాటక ప్రచారంలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.**
4. **రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులపై తమ ప్రభుత్వం దృష్టిసారించిందని ఆంధ్రప్రదేశ్ జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**
5. **భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతుడైన నటుడిగా, డ్యాన్సర్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మెగాస్టార్ చిరంజీవి చోటు దక్కించుకున్నారు.**

==========================

అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు సమున్నత లక్ష్యాలతో పని చేస్తున్నామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్ అవకాశాల స్వర్గధామమని వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి.. న్యూయార్క్‌లో నిన్న నిర్వహించిన 'మోదీ & యూఎస్- ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రవాస భారతీయులు ఎల్లప్పుడూ దేశానికి బలమైన ప్రతినిధులుగా ఉన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్‌లో డిజిటల్ విప్లవం కొనసాగుతోందని.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా యూపీఐ, 5జీ నెట్‌వర్క్ అమలవుతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

.. వాయిస్...35 సెకన్లు

--------------------------

తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అక్రమాలపై ఇన్‌స్పెక్టర్ జనరల్, ఆపై స్థాయి అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి, వారు సమర్పించిన నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. శ్రీవేంకటేశ్వరస్వామి వారి పవిత్రతను ఎవరూ మలినం

చేయలేరని, మొత్తం ప్రక్షాళన చేసి తిరుమలకు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా తిరుమలకు ఎంతో విశిష్టత ఉందని.. అయితే గత ప్రభుత్వంలో లడ్డూ తయారీకి వాడే పదార్థాలకు రివర్స్ టెండరింగ్ కారణంగా నాణ్యత దెబ్బతిందని ముఖ్యమంత్రి వివరిస్తూ..

...వాయిస్...35 సెకన్లు

---

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తుల మనోభావాలకు విఘాతం కలగకుండా చూడాలని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావుకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో నిన్న టీటీడీ ఈవో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. గత పాలక మండలి హయాంలో నెయ్యి సరఫరాదారును ఎంపిక చేసిన ప్రక్రియను, ఇటీవల ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను వివరించారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదం, శ్రీవారి ప్రసాదాల తయారీలో నిబంధనలను, శాస్త్రోక్తమైన నియమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలియజేశారు. టీటీడీ సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతోందని ఈవో వెల్లడించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆయనకు పలు సూచనలు చేశారు. ధార్మిక అంశాల్లో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు.

---

ఇలా ఉండగా.. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఉదయం శాంతి హోమం నిర్వహిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు వెల్లడించారు. హోమం అనంతరం ఆలయంలోని అన్ని ప్రాంతాల్లో పంచగవ్య ప్రోక్షణ చేస్తామని, దీనివల్ల భక్తుల్లో ఉన్న అపోహలు తొలగిపోతాయన్నారు. తిరుపతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. తిరుమల ఆలయంలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో తెలిసీ తెలియక జరిగే దోష నివారణకు ఏటా శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టులో ఆలయంలో అన్న ప్రసాదపోటు, లడ్డూ పోటులో సంప్రోక్షణ చేశామని శ్యామలరావు వివరిస్తూ...

...వాయిస్...35 సెకన్లు

---

వంద రోజుల పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నిన్న ఆయన లేఖ రాశారు.

---

తెలంగాణ పర్యాటక ప్రచారంలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి వాటికి ప్రాచుర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా బుద్ధవనం థీమ్ పార్కు ప్రచారానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బైక్ రైడర్స్ సంయుక్తంగా హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు నిన్న బైక్ ర్యాలీ నిర్వహించారు.

బేగంపేటలోని హరిత ప్లాజా వద్ద రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో కలిసి మంత్రి కృష్ణారావు బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బైక్ రైడర్లతో కలిసి బైక్ నడుపుతూ తార్నాక వరకు వెళ్లారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, మొదటి 100 రోజుల్లో ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

గత ఐదేళ్లలో హంద్రీనీవా పనులు మందగించాయని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నంద్యాల జిల్లాలో నిన్న పర్యటించిన ఆయన.. మల్యాల పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రామానాయుడు.. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులను సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హంద్రీ నీవా ప్రధాన కాలువ విస్తరణ పనులను వచ్చే సీజన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

నాలుగు దశాబ్దాలకుపైగా సినీ ప్రస్థానంలో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న సినీ కథానాయకుడు చిరంజీవి మరో విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతుడైన నటుడిగా, డ్యాన్సర్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 156 సినిమాలు.. 537 పాటలు.. 24 వేల నృత్య రీతులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. ఈ మేరకు నిన్న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రిచర్డ్ స్టెన్నింగ్, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్... చిరంజీవికి ఈ అవార్డును ప్రదానం చేశారు. కాగా.. చిరంజీవికి గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సామాజిక రంగ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలోని జలతరంగిణి జలపాతంలో ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. ఏలూరు జిల్లా ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న 13 మంది విద్యార్థులు నిన్న మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చారు. జల తరంగిణి జలపాతం వద్ద స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. అప్పటికే ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో కొండలపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా రావడంతో విద్యార్థులందరూ బయటికి వచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిలో ఐదుగురు కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వారిలో ఇద్దరిని కాపాడారు. గల్లంతైన మరో ముగ్గురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

====================